అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- బోధన్ ప్రాజెక్టు పరిధిలో సౌకర్యాల లేమితో అవస్థలు
- కొత్త భవనాలు మంజూరు చేయాలని వినతి



బోధన్‌లోని రెండో వార్డులోగల అంగన్‌వాడీ కేంద్రం

బోధన్‌టౌన్(బోధన్) : బోధన్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు పరిధిలోని మండలాల్లోని గ్రామాలతో పాటు బోధన్ పట్టణంలో 331 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 187 అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే శాశ్వత భవనాలు ఉన్నాయి. బోధన్ పట్టణంలో 77 అంగన్ వాడీ కేంద్రాలు ఉండగా ఒక్క దానికి మాత్రమే శాశ్వత భవనం ఉంది. ప్రతి నెల గ్రామాల్లో రూ. 2 నుంచి 3 వేల వరకు, పట్టణ ప్రాంతాల్లో గల కేంద్రాలకు రూ. 3 వేల నుంచి 4 వేల అద్దె చెల్లిస్తున్నారు. అద్దె చెల్లించినా కేంద్రాల్లో వసతులు లేమి నెలకొంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడంతో పాటు బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలకు పౌష్టికాహార లోపాన్ని నివారించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు సౌకర్యాల లేమితో అవస్థలు ఎదుర్కొంటున్నాయి. ప్రతి కేంద్రంలో ఏటా 20 నుంచి 25 మంది చిన్నారులు ఉంటారు. ఈ అంగన్‌వాడీ కేంద్రాల్లో 0 నుంచి 5 ఏళ్ల పిల్లలకు విద్యా బుద్ధులతో పాటు వారికి ఆట, పాటల కోసం అనేక ఆట వస్తువులను ఏర్పాటు చేస్తారు. పౌష్టికాహారం అందించడం, గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య క్షేమ సలహాలు అందిస్తారు. 0 వయస్సు నుంచి 9 ఏళ్ల వరకు గల పిల్లలకు టీకాలు ఇస్తారు. ఇటీవల కాలంలో 28 అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు ప్రభు త్వం అనుమతించింది. ఐసీడీఎస్ ఉన్నత అధికారు లు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించడంతో పాటు అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రతిపాదనలు పంపించాం



బోధన్ ఐసీడీఎస్ సీడీపీవో ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల శాశ్వత భవనాల నిర్మాణం కోసం డీడబ్ల్యూవో దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవల కాలంలో 28 నూతన భవనాలు మంజూరు కాగా, మిగితా వాటి కోసం ల్యాండ్ సర్వే చేయిస్తున్నాం. భవనాల మంజూరు కోసం రెండు నియోజక వర్గాల ఎమ్మెల్యేలకు విన్నవించి శాఖపరంగా ప్రతిపాదనలు పంపించాం.

– పద్మ, సీడీపీవో, బోధన్

ఈ గుంతలు.. డేంజర్


తొండాకూర్ నుంచి డొంకేశ్వర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంత


డొంకేశ్వర్ శివారులో రోడ్డు మధ్యలో..

డొంకేశ్వర్ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు మధ్యలో ఏర్పడిన లోతైన గుంతలు ప్రమాదకరంగా మారాయి. క్రాసింగ్‌ల వద్ద ఉండడంతో దగ్గరికి వచ్చేంత వరకు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు ఈ గుంతలను తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రుల్లో అసలే కనిపించక రోజుకో ప్రమాదం జరుగుతోందని స్థానిక రైతులు చెప్తున్నారు. గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

– డొంకేశ్వర్(ఆర్మూర్)

జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్

నందిపేట్(ఆర్మూర్): డెంగీ, మలేరియా, విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన సమావేశంలో జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి తమ తమ గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలను సమర్పించాలన్నారు. జ్వరం లక్షణాలు కనిపిస్తే పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వార్డ్ ఆఫీసర్లు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించేందుకు కలిసి పనిచేయాలన్నారు. పీహెచ్ఎన్ పద్మావతి, భాస్కర్, సూపర్‌వైజర్లు హేమలత, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నందిపేటలో పర్యటించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


నందిపేటలో పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలో శనివారం అధికారులు పర్యటించారు. పారిశుద్ధ్య లోపం, విజృంభిస్తున్న విష జ్వరాలు శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రంలో జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక ఎస్ మార్ట్ సమీపంలోని టైర్ల షాప్‌లను వద్ద గల చెత్త చెదారం తొలగించాలని ఆదేశించారు. దోమల లార్వాలను చూపించి వాటిని తీసివేసి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వైద్యాధికారి ప్రవీణ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎస్జీఎఫ్ జోనల్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి వాలీబాల్, కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. కమ్మర్‌పల్లి జోనల్ వాలీబాల్ అండర్–17 బాలుర, బాలికల విభాగం, అండర్–14 బాలుర, బాలికల విభాగం, కబడ్డీ అండర్–17 బాలుర, బాలికల విభాగాల్లో నిర్వహించగా, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాలల్లోని ప్రభుత్వ పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో..

భీమ్‌గల్‌లోని కృషి హైస్కూల్‌లో భీమ్‌గల్ అర్బన్ జోన్ స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్–17, అండర్–14 బాలుర, బాలికల విభాగంలో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించగా, 13 పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను భీమ్‌గల్ అర్బన్ జోన్ జట్టుకు ఎంపిక చేశారు. జోనల్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగే


ఎంపికైన క్రీడాకారులతో ఎంఈవో నరేందర్

జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని పీడీలు నాగేష్, రమణ తెలిపారు. ఎంఈవోలు ఆంధ్రయ్య, స్వామి, పీడీలు నాగభూషణం, శ్యామ్, ప్రేమ్ ఆనంద్, రమేష్‌గౌడ్, మాధురి, జ్యోతి, స్వప్న, బాలు, సంజీవ్, నరేష్, లింగం, అభిషేక్, శేఖర్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్ మండల కేంద్రంలో..

పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలో శనివారం జోనల్‌స్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఆలూర్, నందిపేట్, డొంకేశ్వర్ మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఆలూర్ ఎంఈవో ఎం నరేందర్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీడీ రాజేష్, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేల్పూర్ ఉన్నత పాఠశాలలో..

వేల్పూర్: వేల్పూర్ ఉన్నత పాఠశాలలో అండర్ 14, అండర్ 17 బాలబాలికల కబడ్డీ, వాలీబాల్ జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపికను శనివారం నిర్వహించారు. భీమ్‌గల్, వేల్పూర్ మండలాల పాఠశాలల క్రీడాకారులను ఎంపిక చేయడానికి పోటీలను నిర్వహించారు. సోమవారం జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఇక్కడ ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజన్న, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లి జోనల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు


భీమ్‌గల్ అర్బన్ జోన్ జట్టుకు ..


వేల్పూర్‌లో వాలీబాల్ ఆడుతున్న పోటీలు

పంట నష్ట పరిహారం చెల్లించాలి

- గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను నిలదీయండి
- ప్రశ్నించే సాధారణ కార్యకర్తలపై కేసులు సరికాదు
- మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్


బోధన్‌లో కాంగ్రెస్ బాకీ కార్డుల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే షకీల్‌ఆమేర్

బోధన్ : భారీ వర్షాలు, వరదలతో నియోజకవర్గంలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ అన్నారు. దీంతో నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలోని స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ మండల నాయకులతో కలిసి కాంగ్రెస్ బాకీ కార్డు వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మీడియాతో మాట్లాడారు. వరదల సమయంలో ఎస్ఆర్ఎస్పీ గేట్లను ఉద్దేశ్యపూర్వకంగానే ఎత్తకపోవడంతోనే ఇతర జిల్లాలకు మేలు జరిగిందని ఆరోపించారు. దీంతో ఈప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా బోధన్ నియోజక వర్గంలోని రైతుల పంటలు మునిగిపోవడంతో పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ హామీలతో పాటు మరో 420 హామీలిచ్చిందని గుర్తు చేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను హామీలపై నిలదీయాలన్నారు. రెండేళ్ల పాలనలో మంజీర నది ఇసుకను పూర్తి తవ్వేసి తరలించారని ఆరోపించారు. సమస్యలపై మాట్లాడుతున్న తమ పార్టీ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని ఈ వైఖరి సరికాదన్నారు. ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునే అవకాశం కల్పించేందుకు బోధన్‌లో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ను ప్రారంభించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కోరారు. పార్టీ మండలాల నాయకులు సంజీవ్, నర్సింగ్‌రావు, శ్రీరాం, భవానీపేట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం షకీల్‌ను పార్టీ నాయకులు సన్మానించారు.

నష్ట పరిహారం చెల్లించాలని రాస్తారోకో

రెంజల్(బోధన్): ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో నీట మునిగిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. రెంజల్ తహసీల్దార్ కార్యాలయం చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తీర్చాలని కోరారు. అనంతరం స్థానిక తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై చంద్రమోహన్‌లకు వినతిపత్రాలు అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు భూంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఎఖార్‌పాష, రాజు, నీలా మాజీ విండో చైర్మన్ ఇమాంబేగ్, నాయకులు మౌలానా, తిరుపతి హన్మాండ్లు(బుజ్జి), రఫీక్, కాశం సాయిలు, ఇబ్రహీం, ఖాలీద్‌బేగ్, పాష, మోసిన్‌బేగ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.


రెంజల్ తహసీల్ కార్యాలయం చౌరస్తాలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, అన్ని పంటలకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వాలని అఖిల బారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవారం అన్నారు. ఆర్మూర్‌పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శనివారం అఖిలభారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను కాంగ్రెస్‌పార్టీ అమలు చేయాలన డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐయూకెఎస్ నాయకులు సురేష్, కిషన్, రాజన్న, ఆకుల గంగారం తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్ విండో పరిధిలో సోయా కొనుగోలు కేంద్రం..

రుద్రూర్: సోయా పంట చేతికి వస్తున్నందున పోతంగల్ విండో పరిధిలో ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పోతంగల్ మండలం సుంకిని గ్రామరైతులు పోతంగల్ విండో కార్యదర్శి శివాజీకి వినతిపత్రం అందజేశారు. రైతులు నాగనాథ్, మాధవరావు, లక్ష్మణ్, రమేష్, నగేష్ సచిన్, శంకర్, నగేష్ తదితరులున్నారు.

క్లుప్తంగా

బీసీలకు అన్యాయం చేసిన ఘనత బీఆర్ఎస్‌దే



మోర్తాడ్: బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో ఉండి బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ ఆరోపించారు. బీసీలకు రిజర్వేషన్లను తగ్గించిన బీఆర్ఎస్‌కు బీసీ గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. శనివారం ఏర్గట్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం బీసీలకు అన్యాయం చేసేలా బీఆర్ఎస్ బీజేపీతో జతకట్టిందని ఆరోపించారు. నాయకులు రేండ్ల రాజారెడ్డి, సాయికుమార్, సురేష్‌యాదవ్, జుంగాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం



బోధన్‌టౌన్(బోధన్): ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యవరణాన్ని రక్షించాలని ఇందూర్ హైస్కూల్ కరస్పాండెంట్ కోడాలి కిశోర్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఆచన్‌పల్లిలోగల ఇందూర్ హైస్కూల్‌లో పర్యావరణ విద్యా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించాగా,. ఈ ర్యాలీని పర్యావరణ ఎకో క్లబ్‌ల కన్వీనర్ స్వాతి ప్రారంభించారు. పాత వస్త్రాలతో తయారు చేసిన బ్యాగులను ఇంటింటికి, దుకాణాలకు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిలు చెల్లించాలి



బోధన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, లేనిచో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాల జేఏసీ డివిజన్ చైర్మన్ నాగరాజు, కన్వీనర్ గౌతం కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వారు మాట్లాడారు. పేద దళిత, గిరిజన విద్యార్థులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. కో–కన్వీనర్‌లు సంజయ్ తలారి, ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

బోధన్ ఏసీపీకి వినతిపత్రం అందజేత



బోధన్‌టౌన్(బోధన్): లంబాడ జాతిని కించపరిచే విధంగా మాట్లాడిన తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్‌కుమార్ చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బన్ని నాయక్ మాట్లాడారు. లంబాడి, కోయ గోండుల మధ్య రిజర్వేషన్ కోసం జరుగుతున్న వివాదం జరుగుతున్న విషయం తెలిసిందే అన్నారు. గిరిజన సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరేష్ నాయక్, పట్టణ బంజారా నాయకులు బదావత్ శ్రీనివాస్ నాయక్, ప్రవీణ్ నాయక్, రమేష్ నాయక్ తదితరులున్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంలోని యానం గుట్ట సుందరయ్య కాలనీ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కాలనీ వాసులు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సౌకర్యంతో పాటు మౌలిక వసతులు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

బీడీ మార్కెట్‌ను ఎంఎన్‌సీలకు అప్పగించే కుట్ర

బోధన్: బీడీ మార్కెట్‌ను ఎంఎస్‌సీ(మల్టీ నేషనల్ కంపెనీ)లకు అప్పగించేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెద్ద కుట్ర చేస్తోందని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.మల్లేష్ తెలిపారు. శనివారం పట్టణంలోని బీడీకార్ఖానాలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రెండున్నర లక్షల మంది కార్మికులు బీడి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో పొగాకు రైతులు, తునికాకు సేకరణ కూలీలు ఈపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. నాయకులు, కార్మికులు రాములు, కవిత, రూప, అనిత, నాగరాణి, సావిత్రి, సురేఖ, భాగ్యలక్ష్మి, భానుబీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మాక్లూర్: మండలంలోని మాణిక్ బండార్ గ్రామంలో బాధితురాలికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం కాంగ్రెస్ నాయకులు అందించారు. గ్రామానికి చెందిన సనాబేగంకు మంజూరైన రూ: 28 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించామని స్థానిక కాంగ్రెస్ డానియల్, ఆకుల రవి తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్లు..

మాక్లూర్: మండలంలోని మాణిక్‌బండార్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆర్మూర్ మండలం చిట్టాపూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి 3 కంప్యూటర్లు, ప్రింటర్, ప్రయోగశాల పరికరాలు, టేబుళ్లు, క్రీడా సామగ్రిని అందించారు. శనివారం ఈసామగ్రిని ఎంఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో అందజేశారు. దయానంద్‌రెడ్డికి పాఠశాల తరుపున ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ల అప్పగింత

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల పరిధిలో ఇటీవల చోరీకి గురైన రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు గుర్తించి శనివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్‌లు చోరీకి గురైన బాధితులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ ఫోన్‌లను ట్రాక్ చేసి తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. ఈసందర్భంగా మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఎ. వసుధను ఎస్ఐ అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన

బాల్కొండ: బాల్కొండ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం విద్యార్థులకు బాల్కొండ ఎస్సై శైలెందర్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యువత గంజాయి, మత్తు పదార్థలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్‌వో భవాని, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోధన్ నియోజకవర్గ బంద్‌కు సహకరించండి



బోధన్‌టౌన్(బోధన్): బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ కులసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 14న తలపెట్టిన రాష్ట్ర బంద్ పిలుపులో భాగంగా బోధన్ నియోజక వర్గంలో బంద్‌కు ప్రజలు సహకరించాలని తెలంగాణ సామాజిక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సంతోష్ కోరారు. శనివారం పట్టణంలోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. బీసీ నాయకులు బీర్కూర్ శంకర్, ఆకుల శ్రీనివాస్, గంగారాం, కోట అబ్బయ్య, టీఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డల్లా సురేష్, ఎస్సీ నాయకులు కంగేకర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం

ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రాజకీయ నాటకాలతో బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ అవేజ్ అన్నారు. శనివారం ఆర్మూర్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్లపై పంటలు ఆరబోయకుండా రైతులు సహకరించాలి

మోర్తాడ్ /కమ్మర్‌పల్లి : భీమ్‌గల్ సర్కిల్ పరిధిలోని మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, భీమ్‌గల్ మండలాల్లోని వివిధ గ్రామాల రోడ్లపై వరి, సోయా, మక్కలు ఇతర ధాన్యలను ఆరబోయకుండా రైతులు సహకరించాలని సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ సూచించారు. ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సూచనలను పాటించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న కాగడ హారతి పూజలు

రుద్రూర్: మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి విఠలేశ్వర స్వామి ఆలయంలో శనివారం కాగడ హారతి పూజలు నిర్వహించారు. పండరీపూర్ సంప్రదాయం అనుసరించి ప్రతి ఏడాది పౌర్ణమి నుంచి కార్తీక పౌర్ణమి వరకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పూజారి రామ శర్మ తెలిపారు.

ద్విచక్ర వాహనం వేలం

మోర్తాడ్ : మోర్తాడ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఒక కేసులో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఈనెల 15న వేలం పాటలో విక్రయించనున్నట్లు సీఐ గుండప్ప తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు 25 శాతం ఈఎండీ చెల్లించాలని సూచించారు.

బీఎస్పీ సాలూర అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్



బోధన్: బహుజన సమాజ్ పార్టీ సాలూర మండల నూతన అధ్యక్షుడిగా మందర్నా గ్రామానికి చెందిన యువనాయకుడు వాగ్మారే జ్ఞానేశ్వర్ నియమాకమయ్యారు. పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జ్ఞానేశ్వర్‌కు నియమాక పత్రం అందించి కండువాతో కప్పి సత్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ,సీనియర్ న్యాయవాది నీరడి ఈశ్వర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సింగాడే పాండు, సంతోష్, నాయకులు నీరడి రవి ,షేక్ మహ్మద్, శ్రీకాంత్, రామకృష్ణ తదితరులున్నారు.

మక్క, సోయా కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి

బాల్కొండ: మక్కల, సోయాల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు నర్సయ్య డిమాండ్ చేశారు. శనివారం ముప్కాల్‌లో రైతు ఆరబెట్టిన మక్కలు, సోయాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.